
# దూరానికి దగ్గిరగా...

బి.వి. రమణారావు



ఆ నిర్లిప్తత, ఆ నిర్విచారం, ఆ చిరునవ్వు, ఆ వేదాంతధోరణి చూస్తుంటే శ్రీహరిని గురించి జాలిపడాలో, అభినందించాలో, లాగి లెంపకాయ కొట్టాలో అర్థం కాదు. చేసేది గుమాస్తా వుద్యోగం. బ్రతుకుతెరువు చూసుకోకుండా మడిగట్టుక్కూర్చుంటే కష్టాలు రాకుండా వుంటాయా! వీడేమీ  తుకారామా! రామదాసా! వీడి ధర్మవర్తనకి మెచ్చి ఆ దేవుడు దిగొచ్చి ఆదుకుంటాడనుకోడానికి! పదిమంది తొక్కినత్రోవనే మనం పోవాలిరా అంటే వినడే! వాడి దారి వాడిదే.

చిన్నప్పట్నుంచీ శ్రీహరి నెరుగుదును. స్వత హాగా తెలివైనవాడు, స్నేహపాత్రుడు. వీడి వేదాంత ధోరణికి వాడి తాతయ్య కారణం. చివరిదశలో చెయ్యి

పట్టుకుని ఆయన్ని రోజూ గుడికి తీసుకెళ్ల డం వీడి డ్యూటీ. అది ఆయన వ్యసనం. ఆయన ప్రబోధాలు వినేవాడెవడూ లేకపోవడంతోటే వీడికి ఆయన పాండిత్యమంతా నూరిపోసేవాడు. అవన్నీ తలలో పాతుకుపోయాయేమో, లౌకికజీవితంలో శుద్ధశుంఠలాగ తయారయ్యేడు.

శ్రీహరి పద్దెనిమిదోయేట బియ్యే చదువు తుండగా బస్సు ప్రమాదంలో తల్లీదండ్రీ పోయేరు. తండ్రి వృత్తిరీత్యా వడ్రంగి. పదహారేళ్ల తమ్ముడు, పద్నాలుగేళ్ల చెల్లెలు చదువుకుంటూ వుండటంచేత తను చదువు మానేసి ఓ ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తూ, రాత్రులు వాళ్లిద్దరి సహాయంతోనూ కుర్చీలు, బల్లలు, బట్టల స్టాండులు, పీటలులాంటివి చేసి అమ్ముతూ, వాళ్లని చదివిస్తూ వొచ్చేడు.

సర్వీస్ కమిషన్‌లో సెలెక్టయ్యి మా ఆఫీసులోనే ఉద్యోగం సంపాదించేటప్పటికి, వయస్సులో నాకంటే పెద్దయినా సర్వీస్‌లో రెండేళ్లు జూనియర్ అయ్యేడు.

తమ్ముడు బికాం పాసయ్యేడు. మంచి అందగాడు, చురుకైనవాడు. బాగా ఆస్తిపాస్తులున్న కాంట్రాక్టర్ దగ్గిర ఉద్యోగం సంపాదించి, మెప్పించి ఆ యింట్లోనే ఇల్లరికం అల్లుడుగా స్థిరపడిపోయేడు. వాడు మళ్లీ ఈ ఇంటి ఛాయలకు రాలేదు. ఇంటర్ పాసయిన చెల్లెల్ని నర్సింగ్ స్కూల్లో జాయిన్ చేసేడు. చదువు ట్రెయినింగ్ పూర్తయిన తర్వాత ఓ ఏడాదిగా ప్రయివేట్ నర్సింగ్ హోంలో ఉద్యోగం చేస్తుండగా, అక్కడే ఓ అగ్ర కులానికి చెందిన ఫార్మసిస్టు ప్రేమించి, రహస్యంగా రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకుని దుబాయ్ లేవదీసుకు పోయేడు. పోలీసులతో నానాగొడవ అయింది. ఎన్నో అవమానాలకి తలవొంచేడు. దుబాయ్ నుంచి వాళ్లు ఫోన్ చేసేక కాని సద్దుమణగలేదు.

ఉద్యోగవిధుల నిర్వహణలో నిప్పులాంటి వాడనీ, నిజాయితీపరుడనీ పేరు తెచ్చుకున్నాడు. ఆ కీర్తి వాడికి ఆనందమేమో కాని, అప్పులలో మునిగిన, వాడి ఆర్థికదుస్థితికి అందరం జాలి పడేవాళ్లం. వీడిదగ్గిర ఉపకారం పొందిన పార్టీలెవరయినా తృణమో, ఫలమో ముట్టచెప్పాలని చూసినా అవకాశమిచ్చేవాడు కాదు. వాడి పేరు చెప్పి డబ్బు చేసుకుని, వీడి చేత పని చేయించుకున్న సందర్భాలు బయటపడినా పట్టించుకునేవాడు కాదు. నవ్వేసి వూరుకునేవాడు. అలాఅని జీవితం విధి వశమనుకునే మనస్తత్వం కాదు వాడిది. ప్రగాఢమైన ఆత్మవిశ్వాసముంది, సహనం వుంది.

"మీ తమ్ముడూ, చెల్లెలూ ఇలా ప్రవర్తిస్తారనుకోలేదు" అన్నాను ఓసారి మాటలసందర్భంలో నా సానుభూతి ప్రదర్శిస్తూ.

"వాళ్ల కోరికల్ని చంపుకుని యిన్నాళ్లూ నాతోబాటే కష్టపడిపెరిగి పెద్దవాళ్లయ్యేరు. వాళ్ల అభిరుచులకు తగ్గ అవకాశాలు వాళ్లకొచ్చేయి. వాళ్ల బ్రతుకు బరువుబాధ్యతలు వాళ్లే మోసుకునేటంత ప్రయోజకులయ్యేరు. భగవంతుడు వాళ్లని చల్లగా చూడాలనే కోరుకుంటాను" అన్నాడు నవ్వుతూ.

* * *

శ్రీహరికి ముప్పయ్యేళ్లొచ్చేయి. యుడిసిగా ప్రొమోషనొచ్చింది. గవర్నమెంటు క్వార్టర్స్ కనక అద్దె తక్కువే. అప్పులు తీర్చేసేడు. ఏ బాదరబందీ లేకుండా వున్నాడు. వాడికేదైనా మంచి సంబంధం చూసి పెళ్లి జరిపించాలని ఆఫీసులో చాలామంది ప్రయత్నిస్తున్నాం.

"నేను మా మేనమామ కూతుర్ని పెళ్లి చేసుకుంటున్నానురా!" అన్నాడో ఉదయం వాడు మా యింటికొచ్చి.

"మరి ఇన్నాళ్లూ ఏమయ్యేడురా మీమేనమామ?" అడిగేను, నివ్వెరపోయి. అసలు వీడికో మేనమామున్నట్టే నాకు తెలీదు.

"ఆయనకి ఇల్లు గడవడమే కష్టంగా వుంది. ఈ ఊళ్లోనే ఏదో రెండో పెళ్లివాడి సంబంధం చూసుకోడానికి, కూతురు శాంతిని వెంటబెట్టు కొచ్చేడు. దానిక్కూడా కట్నం లాంఛనాలూ అంటూ బేరాలాడేరుట. పైగా శాంతికి పెళ్లి కావల్సిన చెల్లెలు కూడా వుంది."

"అంచేత నువ్వు పెళ్లి చేసుకుని ఉద్ధరిస్తానంటావు! పిల్లకి ఎన్నేళ్లు? ఎలావుంటుంది?"

"ఇరవైయేడో ఇరవైఎనిమిదో వుంటాయి. పెద్ద అందగత్తేమీ కాదు. పైగా చదువుకోలేదు. భార్య పోయిన మా మావయ్యకి సాయం చేస్తూ యింట్లోనే వుందిన్నాళ్లూ. పాపం! చాలా బుద్ధిమంతురాలు" అన్నాడు వర్ణన పూర్తిచేస్తూ.

"నువ్వు పెళ్లి అవసరమని చేసుకుంటున్నావా? ఆ అమ్మాయి పెళ్లి సమస్య పరిష్కరించడానికి చేసుకుంటున్నావా? అసలు ఇన్నాళ్లూ మీరెలా వున్నారో పట్టించుకోని మేనమామ ఇప్పుడొచ్చి కూతుర్ని చేసుకోమంటాడా?"

"పాపం, ఆయన అడగలేదురా! నేనే శాంతిని చూసి, నచ్చి చేసుకుంటానన్నాను" అన్నాడు. పెళ్లి కూడా ఓ పరమార్థమే అన్న భావన నా ఊహకి అతీతం.

"మేనరికం అంటున్నావు. ఎవరైనా డాక్టర్ని సంప్రదించి రక్తసంబంధం తాలూకు పరీక్షలున్నాయి. ముందు అవి చేయించు!" అన్నాను.

"అన్నీ ఆ దేవుడే చూసుకుంటాడురా! నేనే పెళ్లి చేసుకుంటానన్నప్పుడు శాంతి మొహంలో కనబడ్డ ఆనందంలో ఆ దేవుడి చిరునవ్వుని చూశానురా!" అన్నాడు - అంతా దైవం మీద భారం వేస్తూ.


"ఊఁ, ముహూర్తం ఎప్పుడు?" అడిగేను - ఇంకా ఈ విషయంలో వాడితో వాదించడం నిష్ప్రయోజనమని.

"ఇదిగో సెలవు చీటీ! మరి భారమంతా నీదే!' ' అన్నాడు లీవు లెటర్ నా చేతికిచ్చి, నా భుజం తడుతూ.

వెంటనే ఆఫీసుకెళ్లి ఈ శుభసందర్భంలో అందరూ ఏకమై, వాడి మేనమామ పెళ్లి ఎలా జరిపినా, ఇక్కడ నూతన దంపతులకు చక్కని సన్మానం ఏర్పాటు చెయ్యాలన్న ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరై ఆ సెలవు చీటి మడతలు విప్పి చదివి కొయ్యబారిపోయాను. 'ఈ ఊళ్లో రామాలయంలో నా పెళ్లి కనక ఈ రోజుకు సెలవిప్పించమని వేడుకుంటున్నాను.' ఇదీ దాని సారాంశం.

"ఏమిట్రా ఈ పెళ్లి! మేమందరం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తుంటే! ఓ శుభ లేఖ లేదు, కనీసం నోటితో పిలుపైనా లేదు. ఈ చీటీలోనైనా ఎన్నిగంటలకు ముహూర్తమో లేదు. అంతే మెమెవళ్లం రావక్కర్లేదా! అందరూ ఏమనుకుంటారోనన్న ఇంగిత జ్ఞానం కూడా లేదా!" అన్నాను- లేచి నిలబడి కోపంతో నిలువెల్లా ఒణికిపోతూండగా.

"ఒరేయి! ఒరేయి! ఏమిట్రా ఆ కోపం! మీ అందరి ఆశీస్సులు కావాలి! మధ్యాహ్నం పెళ్లి,



### ఆపరేషన్

కౌసల్యమ్మ : డాక్టరుగారూ! మత్తు ఇంజక్షన్ వెయ్యకుండా ఆపరేషన్ చెయ్యగలరా?

డాక్టర్ : ఓ.. చెయ్యగలను. మీరు చాలా ధైర్యవంతురాలులాగా ఉన్నారే!

కౌసల్యమ్మ : ఆపరేషన్ నాక్కాదండీ . మా అత్తకి.

**ముద్దా రమణమూర్తి ( ఎస్ . సడ్లపల్లి)**

సాయంత్రం ఆఫీసు విడిచిపెట్టే సమయానికి నేనూ, శాంతీ అక్షతలు, స్వీట్సూ పట్టుకుని అక్కడికే వస్తాం! మీరందరూ మా దంపతుల్ని ఆశీర్వదిద్దురుగాని!'' అని వాడు నవ్వుతూ నా చేతులు పటుకుంటే వాడి నిరాడంబరత్వంలో వాడి విశ్వరూపాన్ని చూసి నిర్ఘాంతపోయేను.

* * *

రూపురేఖలు సంగతెలా ఉన్నా, గత ఇరవై ఏళ్లుగా మంచితనంలోనూ, సేవాతత్పరతలోనూ ఎవళ్లింట్లో శుభకార్యం జరిగినా, ఎవరికి కష్టమొచ్చినా నడుం కట్టుకు ముందుకు రావడంలో శ్రీహరికి ఏమాత్రం శాంతి తీసిపోదన్న పేరు తెచ్చుకుంది. పైగా వాళ్లకి రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు. కొడుకు శ్రీరాం స్కాలర్‌షిప్ సంపాదించి ఈ ఊళ్లోనే ఇంజనీరింగ్ కోర్స్ చదువుతున్నాడు. కూతురు శారద బియస్సీ చదువుతోంది.

మేమందరం వాయిదాల పద్ధతిలో హౌసింగ్ బోర్డ్ ఇళ్లు కొనుక్కోడానికి దరఖాస్తు ఫారాలు తెచ్చుకున్నాం. వీడిక్కూడా ఒకటి తెచ్చి ఇచ్చాను. అయితే దరఖాస్తు పెట్టినవాళ్లందరికీ ఇళ్లొస్తాయా! కాస్త చేతులు తడి చెయ్యాలి, లేదా పలుకుబడుండాలి. దరఖాస్తు పెట్టరా, మిగతా విషయాలు మేం చూసుకుంటాం అన్నాం. లైసెన్సులు, పెర్మిట్లు ఇచ్చే సెక్షన్‌లో పనిచేస్తున్నాడు. వాడు 'ఊఁ' అంటే సహాయం చెయ్యడానికి పార్టీలు క్యూలో నిలబడతారు. వాడికి నచ్చజెప్పమని శాంతికి చెప్పేను. మరి చెప్పినట్లుంది.

"అప్పుల బాధంటే ఏమిటో తెలియనివాణ్ని కాదు. ఇప్పుడు ఏ లోటూ లేకుండా రోజులు దొర్లిపోతున్నాయి. ఇప్పుడు ఈ బరువు నెత్తిన పెట్టుకోదల్చుకోలేదు. ఏమీ అనుకోకు!'' అన్నాడు నాకు నచ్చజెప్పే ధోరణిలో.

"అప్పేమిట్రా! వాయిదాల మీద ఇల్లు కొంటాం!'' అన్నాను ఆర్థిక సూత్రాన్ని వివరిస్తూ.

''కడితే వాయిదా, కట్టలేకపోతే అప్పు. ఇప్పుడు నాకు ఏ అవసరమొచ్చిందని ఇల్లు కొనడం!'' అన్నా డు నవ్వుతూ. వాడి నవ్వు చూస్తే నాకు ఒళ్లు మండుతుంది.

"సొంతానికి మనదీ ఉన్న ఓ ఇల్లుంటే, నీ కక్కర్లేకపోయినా, ఉత్తరోత్రా నీ పిల్లలకుంటుంది. మరీ చిన్నపిల్లాడికి చెప్పినట్టు చెప్పాలా?'' అన్నాను.

''ఈ విశ్వమంతా భగవంతుడిదిరా! ఇందులో ఏదీ ఎవరిదీ కాదు. ఎవళ్లకి వాళే వాళ్ల హయాంలో వాళ్ల అధీనంలో ఉన్న ఆస్తిపాస్తులు వాళ్ల సొంతం అనుకుంటారు!'' అన్నాడు అదే ధోరణిలో వాదిస్తూ.

"నీకు సొంత ఇల్లంటే నమ్మకం లేకపోయినా నీ భార్య పిల్లలకుంటుందిగా!'' వాళ్లు మాత్రం సొంతమా!'' అంటావా!'' అన్నాను ఒళ్లుమండి. 'ఋణానుబంధ రూపేణా పశుపత్ని సుత ఆలయ' అన్న వేదాంత సూక్తి వినడానికి బాగానే ఉంటుంది. రైటే. ఏ ఆస్తిపాస్తులు మనవి కావు. కాలక్రమేణా చేతులు మారుతూనే ఉంటాయి.

'నాది, నా వాళ్లు' అన్న భవబంధాలు ఎంత అజ్ఞానమైనా నిత్యజీవితంలో వాటిని విస్మరించడం సాధ్యమా! వాడితో ఎంత వాదించినా ప్రయోజనం లేకపోయింది. వాడి మూర్ఖత్వం వాడిది.

* * *

ఇంజనీరింగ్ కోర్సులో గోల్డ్ మెడల్ వచ్చిన పదిమందిలోనూ శ్రీహరి కొడుకు శ్రీరాం ఉన్నాడు. వాడు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు చెయ్యడానికి నాలుగు కంపెనీలు స్కాలర్‌షిప్ ఇవ్వడానికి ముందుకొచ్చాయి. వీడి ప్రొఫెసర్ ప్రోత్సాహంతో అప్లికేషన్ పెడితే రెండు అమెరికన్ యూనివర్సిటీలు ఫెలోషిప్ ఇస్తానన్నాయి. వాడికి స్టేట్స్‌కి వెళ్లాలని ఉంది. తండ్రితో చెప్పడం భయం. తండ్రిని ఒప్పించమని ప్రాధేయపడ్డాడు.

మా పిల్లల్ని చూస్తే ఒళ్లు మండుతుంది. చదువులు అంతంత మాత్రం. డబ్బు సంపాదించే మార్గాల అన్వేషణ మాత్రం ఆకాశాన్నంటుతుంది. ఒకడు ఇండస్ట్రీ అంటాడు. ఒకడు ఏజెన్సీలంటాడు. ఇంకోడు ఫైనాన్స్ కంపెనీ అంటాడు. ఒక్కడికీ కష్టపడి ముందు ఎక్కడో పనిచేసి అనుభవం సంపాదిద్దామన్న జ్ఞానం లేదు. వీళ్లెక్కడ కష్టపడతారోనని అడిగినవన్నీ సమకూరుస్తూ గారాబంగా పెంచేను. ఇప్పుడనిపిస్తుంది, గడ్డి తిని సంపాదించి వీళ్లని నేనే పాడుచేశానేమోనని! చూస్తూండగా కోటీశ్వరులైపోవాలని వాళ్ల ప్లాన్లు. వాళ్లు మహా మేధావులనీ, వాళ్లు పైకి రావడానికి నా తెలివి తక్కువతనమే అవరోధమని మా ఆవిడ కూడా త్రికరణశుద్ధిగా నమ్మింది. దాంతో వాళ్లిష్టానికి వాళ్ల నొదిలేసేను.

"ఇక్కడ పెద్దకంపెనీలు పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్‌కి ఇక్కడ యూనివర్సిటీలకు స్పాన్సర్ చేస్తున్నారు. చదువు పూర్తయ్యాక వాళ్లే ఉద్యోగాలిస్తారు. ఏదైనా మంచి కంపెనీలో చేరితే అవసరమైన ట్రైనింగ్‌కి వాళ్లే విదేశాలకు పంపుతారు కదా!'' అన్నాడు శ్రీహరి, నేననుకున్నట్టే.

"స్టేట్స్‌లో చదువుకోడానికున్న అనుకూలాలు, ఆ ప్రమాణాలు ఇక్కడ ఉండవు. పైగా అక్కడే చదివితే అక్కడే మంచి ఉద్యోగావకాశా లుంటాయని శ్రీరాం అభిప్రాయం. వాడికేవో ఆశ లు, ఆశయాలు ఉంటాయి!'' అన్నాను.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి ...' ' అంటూ చెప్పబోయాడు శ్రీహరి - వాడి వేదాంత ధోరణిలో.

"ఒరేయ్! వాడి ప్రయోజకత్వంతో స్కాలర్‌షిప్ సంపాదించి వాడు ఇంజనీరింగ్‌కోర్సు పాసయ్యాడు. ఎవడెంతవాడవుతాడో! నువ్వూ, నేనూ వాడికి చెప్పేటంతవాళ్లంకాము. వాడు ఈ తరం యువకుడు.. వాడి ప్రొఫెసర్‌ని కూడా సంప్రదించేడు. ఇంత తెలివైనవాడు ...''

"ఇక్కడుండక్కర్లేదు, విదేశాలకు పంపించెయ్యాలి అంటావు. సరే నా అభిప్రాయంలో సంకుచిత్వం ఉందనుకుంటే వాడిష్టమొచ్చినట్లే చెయ్యమను. మీరందరూ ఆలోచించుకుని ఏమి నిర్ణయించినా నాకు సమ్మతమే. ఏదైనా దైవ నిర్ణయంగా భావిస్తాను!'' అన్నాడు శ్రీహరి - మా అందరి మొహాలకేసి చూసి చిరునవ్వు నవ్వుతూ. దాంతో శ్రీరాంతోబాటు శాంతి, శారదల మొహాలు కూడా సంతోషంతో వెలిగిపోయాయి. నా ప్రయత్నం ఫలించినందుకు నాకూ ఆనందంగానే ఉంది.

* * *

ఇప్పుడున్న డైరెక్టర్ ఈ నెలాఖరికి రిటైరైపోతే కొత్త డైరెక్టరెవరొస్తారా అని మా డిపార్ట్‌మెంట్ ఉద్యోగస్తులమందరం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం. వచ్చేవాడి కులం, మతం, ప్రాంతీయ అభిమానం, నైతికప్రవృత్తి ప్రాతిపదికగా ఆఫీసులో ఓ సెక్షన్ లోంచి మరో సెక్షన్‌కి ఉద్యోగస్తుల్ని బదిలీ చెయ్యడం పరిపాటి. రాధాకృష్ణ మా పినతండ్రి కొడుకు. నాకంటే ఆరేళ్లు చిన్న. ఈమధ్యనే అయ్యేఎస్ కూడా కన్ఫర్ చేశారు. బంధువుల పెళ్లిలో కనబడి పక్కకి పిలిచి, "మీ డిపార్ట్‌మెంట్‌కి నన్నే డైరెక్టర్‌గా వెయ్యమని రికమండ్ చేస్తూ ప్రపోజల్ వెళ్లింది. చీఫ్ సెక్రటరీ సంతకం కూడా అయిపోయింది. ఫైల్ సి.ఎం. పేషీలో ఉంది. రెండు మూడు రోజుల్లో ఆర్డర్స్ వచ్చేస్తాయి!'' అన్న చల్లని వార్త చెప్పేడు.



"చాలా సంతోషంరా! ఎలాంటి యెములాడొస్తాడో అని హడలి చస్తున్నాం!" అన్నాను వాడి చెయ్యి నా రెండు చేతుల్లోకీ తీసుకుంటూ.

"మనం బంధువులమని తెలిసినా, నేను బంధుప్రీతి చూపెడుతున్నానన్న అపకీర్తి రాకుండా చూడాలి. ఏదో అదను చూసుకుని అందరి ముందూ ఏదో వంకని నిన్ను అప్పుడప్పుడు మందలించినా ఏమీ అనుకోకు. నేను స్ట్రిక్ట్ ఆఫీసర్నన్న పేరున్న విషయం నీకు తెల్సు కదా!" అన్నాడు. అది ఆత్మవంచనని నాకూ తెలుసు... వాడికీ తెలుసు.

"నాకర్థమైందిగా! ఇంక నాకు విడమర్చి చెప్పక్కర్లేదు!" అన్నాను.

"అది సరే, మీ డిపార్ట్‌మెంట్‌లో శ్రీహరి అనే ఎక్సెంట్రిక్ అసిస్టెంట్ డైరెక్టరున్నాడుట. సత్య హరిశ్చంద్రుడిలాగా పోజులు కొడతాడుట!" అన్నాడు.

"వాడు నాకు జూనియర్. మంచి ఫ్రెండ్. వాడేమీ సమస్య కాదు!" అన్నాను.

"వాణ్ని ఆ లైసెన్సులు సెక్షన్‌లోంచి తీసిపారేసి ..."

"వద్దు, వద్దు! వాణ్ణి ఆ సెక్షన్‌లోనే ఉండనీయ్! ముఖ్యమైన ఫైల్సుంటే వాణ్ణి బైపాస్ చేసి నాకు పంపు!" అన్నాను.

"వాడేమీ గొడవ పెట్టడు కదా?"

"వాడికొచ్చిన ఫైల్స్ చూస్తాడు. రానివాటిని గురించి పట్టించుకోడు. ఆ విషయాలన్నీ నేను చూసుకుంటాను!" అని హామీ ఇచ్చాను.

తర్వాత వాడి భార్యా బిడ్డల యోగ క్షేమాల్ని గురించి అడిగాను. వాడి భార్యకి హై బి.పి. సుగర్ కంప్లయింట్ ఉన్నాయి. డైట్ కంట్రోల్, మందు లేసుకోవడం, ఎక్సర్‌సైజు చెయ్యమంటాడు డాక్టర్. సరిగ్గా చెయ్యదుట. అందుకే ఈ పెళ్లి రిసెప్షన్‌కి రాలేదన్నాడు. కొడుకు, మధు సివిలింజినీరింగ్ పాసై రియల్‌ఎస్టేట్ బిజినెస్సు, బిల్డింగ్ కాంట్రాక్టులు చేసి బాగా సంపాదిస్తున్నాడు. "మా మధు కష్టపడతాడు. లాభాలు పంచుకుతినడానికి మాత్రం మరో ముగ్గురు భాగస్వాములున్నారు. త్వరగా వాళ్లని వదుల్చుకుని ఇండిపెండెంట్‌గా చేసుకోమన్నాను!" అన్నాడు రాధాకృష్ణ. మధు కాక, రాధాకృష్ణకి స్వర్ణ అనే కూతురుంది. పెళ్లి చేసి కూతుర్నీ, అల్లుణ్ణీ కెనడా పంపించేశాడు. వాళ్లక్కడే స్థిరపడిపోయారు. మధుకి కూడా పెళ్లయి నాలు గేళ్లయింది. వాడికి కుబేరుడిలాంటి మావగారున్నాడు. మొత్తంమీద రాధాకృష్ణ అదృష్టవంతుడు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకున్నాడు.

* * *

శ్రీహరి కూతురు శారద బియస్సీ తర్వాత బి.ఇడి. పాసయింది. తల్లిలాగే నెమ్మదస్తురాలు. ఉద్యోగంలో చేరాక బుద్ధిమంతుడైన ఓ కాలేజీ లెక్చరర్‌కిచ్చి పెళ్లి చేశాడు. స్టేట్స్‌నుంచి శ్రీరాం కూడా వచ్చాడు. శారదకో లక్ష రూపాయలు ముట్టచెప్పాడు. అంతక్రితం తల్లి పేర ఓ లక్ష పంపాడు. బాగా సంపాదిస్తున్నాడుట. శ్రీహరి మాత్రం తన స్థాయికి తగ్గట్టుగానే నిరాడంబరంగా పెళ్లి జరిపాడు. అతని తత్వం తెలుసున్న మొగపెళ్లివారు కూడా ఆదరంగానే ప్రవర్తించారు. కొడుకు ప్రయోజకత్వానికి శాంతి మురిసిపోయింది.

జనం ఆయన్ని మరిచిపోతారేమోననో, విషాదం కూడా ఆయనకి వినోదమో, జన్మాంతర కర్మ ఫలాల్ని అందించే విధానమో తెలీదు, భగవంతుడు ఆట్టేకాలం ఎవ్వరినీ సుఖపడనివ్వడన్నది మనలో చాలామందికి అనుభవైకవేద్యమే. అమెరికాలోనే ప్రేమించి పెళ్లాడిన పిల్లని వెంటబెట్టుకుని, మళ్లీ అయిదేళ్ల తర్వాత శ్రీరాం సెలవుమీద ఇండియాకి వచ్చాడు. హారతిచ్చి ఇంట్లోకి ఆహ్వానిస్తారని ఎదురుచూసిన దంపతులకి దుర్భరమైన విషాదం ఎదురైంది. పదిహేనురోజుల క్రితమే శారద భర్త స్కూటర్‌మీద వెడుతూండగా లారీ ఢీకోవడంతో అక్కడకక్కడే మరణించినట్టు, తన తల్లి నెల్లాళ్లుగా మంచంపట్టి చావు బ్రతుకుల్లో ఉన్నట్టు తెలుసుకుని శ్రీరాం కుంగిపోయాడు. రెండు సంవత్సరాలక్రితం రిటైరైన శ్రీహరి ఆనందసదన్ అనే అనాధ శరణాలయంలో జీతం బత్తెం లేని మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అటు శరణాలయం నిర్వహణలోనూ, ఇటు ఇంట్లో అంతిమ ఘడియలకోసం ఎదురు చూస్తున్న, కాన్సర్ పేషంటైన భార్య సేవ లోనూ, ఆర్నెల్ల పసికందునెత్తుకుని భర్త వియోగంలో కుమిలి పోతున్న కూతురు శారదకి ధైర్యం చెప్పడంలోనూ నిర్విరామంగా శ్రీహరి నిమగ్నుడై ఉన్నాడు. నేనే ఎయిర్‌పోర్ట్‌కెళ్లి శ్రీరాం దంపతుల్ని కలుసుకుని, త్రోవలో పరిస్థితు లన్నీ చెప్పి, ఓదార్పు వచనాలు చెబుతూ వాళ్లింటికి తీసుకెళ్లాను.

"ఈ విషయాలు నాకెందుకు తెలియబరచలేదు?" అడిగాడు శ్రీరాం - సాయంత్రం కాస్త తేరుకున్నాక.


"నెల్లాళ్లలో నీ భార్యని వెంటబెట్టుకు వస్తున్నట్టు రాశావు. ఎలాగూ వస్తున్నావు కదా, ఈలోగా మీ నూతన దంపతుల మనస్సు క్షోభ పెట్టడమెందుకు రాయొద్దన్నాడు మీ నాన్న. రాసినా నువ్వు వచ్చి చెయ్యగలిగిందేమీ లేదు. పైగా కంగారుగానూ నువ్వొక్కడివే వచ్చేవనుకో, మీ అమ్మకి చివర రోజుల్లో కొడుకునీ, కోడలినీ కలిసి చూసే తృప్తి లేకపోవచ్చు అని ఆలోచించాము!" అని చెప్పాడు.

"లారీ వచ్చి గుద్దితే కేసు పెట్టి నష్టపరిహారం వసూలు చేయలేదా?" అడిగాడు శ్రీరాం తన డాలర్ల భాషలో.

"అయిదు లక్షలిచ్చారు. మీ నాన్నతో సంప్రదించి ఆ నెత్తురు కూడు తనకక్కర్లేదని, ఆనంద్ సదన్‌కి మీ బావ పేర విరాళంగా ఇచ్చేసింది!" అని చెప్పారు. శ్రీరాం తల దించుకున్నాడు. వాడి భార్య నిర్ఘాంతపోయింది.

కులం గోత్రం గురించి ఎటువంటి తర్జన భర్జనలు జరగలేదు. శాంతి, శ్రీహరి నిండు మనస్సులతో నూతన దంపతులను చూసి సంబరపడి ఆశీర్వదించారు. మధ్యాహ్నం శ్రీహరి మా ఇంటికొచ్చి, "శ్రీరాము భార్య కొత్త దంపతులు ... మా ఇల్లెలాగుందో చూశావు కదా! ఓ పక్కన శాంతి పరిస్థితి అలా ఉంది. శారదా పిల్లాడు కూడా ఇక్కడే ఉన్నారు. శ్రీరాం సంగతెలా ఉన్నా, ఆ అమ్మాయికి అలవాటైన ఏ అనుకూలాలు ఇంట్లో లేవు. శ్రీరాం మొహమాట పడతాడు. నువ్వు చెప్పవల్సిన విధంగా నచ్చజెప్పి వాళ్లని ఏదైనా హోటల్లో ఉండి ఆ అమ్మాయి ఉత్సాహభంగం కాకుండా ఆ అమ్మాయిని వెంటబెట్టుకుని అటూ ఇటూ తిప్పి నలుగుర్నీ పరిచయం చేసి సరదాగా కాలక్షేపం చెయ్యమను. శాంతి కూడా ఈ మాట నీకు చెప్పమంది!" అన్నాడు.

సాయంత్రానికి వాళ్లిద్దరూ హోటల్‌లోకి బస



**అడ్రస్**

ఖుద్దూస్ : మీ అడ్రస్ చెప్పండి మూర్తి గారూ!

మూర్తి : అయ్యో అది తెలుసుకోవడానికి ఇంత దూరం రావాలా? ఒక్క కార్డు రాస్తే పోయేదిగా!

**ముద్దా రమణమూర్తి ( ఎస్ . సడ్లపల్లి )**

మార్చారు. మధ్య మధ్య వచ్చి తల్లిని చూస్తూ, పదిరోజులుందామని వచ్చినా వాళ్ల పదిహేను రోజులున్నారు. ఇంకా ఎన్నాళ్లని ఉండగలరు. వాళ్ల ఇబ్బందులు వాళ్లకున్నాయి. క్షమాపణ చెప్పుకుని తల్లిదండ్రులకు నమస్కరించి తిరుగుమొహం పట్టారు. వెళ్లబోయేముందు కుటుంబ సభ్యులందరి కోసం పేరు పేరునా పట్టుకొచ్చిన బట్టలు బహుమతులు ఉన్న సూట్‌కేసు మా ఇంట్లో పడేసి, "బాబాయ్! మళ్లీ ఆర్నెల్లలో వస్తాను. శారదని పిల్లాణ్ని తీసుకువెడతాను. శారదనీ నాన్ననీ ఒప్పించే బాధ్యత నీ కప్పచెబుతున్నాము!" అని వాళ్లిద్దరూ నా పాదాలకు నమస్కరించి వెళ్లేరు. వాళ్లు బయల్దేరి వెళ్లిన రెండు రోజుల్లో శాంతి కన్ను మూసింది.

* * *

నేను రిటైరయ్యాక శారీరకంగానూ, మానసికంగానూ కూడా నా ఆరోగ్యం దెబ్బతింది. బ్లెడ్ ప్రెషర్‌తోబాటు కీళ్ల నొప్పులు. ఇంట్లో కొడుకులు కోడళ్ల అంతర్యుద్ధాలతో మనశ్శాంతి కరువైంది. తన కొడుకు మధుకి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వ్యాపారంలో సహాయం చెయ్యడానికి నమ్మకమైన మేనేజర్ రాధాకృష్ణ కావాలంటే, ఏదో ఓ వ్యాపకం పేరు చెప్పి ఇంట్లోంచి బయట పడొచ్చునని చేరాను.

ఇంటి ముందు కారాగితే మధు వచ్చాడనుకుని లేచి తలుపు తీశాను. టాక్సీ దిగి గబగబ అడుగులేసుకుంటూ శ్రీరాం వచ్చి అమాంతంగా నా ముందు కూలబడి నా కాళ్ల చేతులతో పెనవేసుకుని "ఏమి బాబాయ్! ఏం పాపం చేశానని నాకీ శిక్ష!" అంటూ కంట తడిపెడితే, వాణ్ని లేవదీసి కుర్చీలో కూలేసి నేను ఎదురుగా కూర్చున్నాను.

శ్రీరాం రెండేళ్ల తర్వాత మళ్లీ వచ్చాడు. శారద కెనడా వెళ్లడానికి ఒప్పుకోలేదు. శాంతి మరణించిన ఏడాదికి శారదకి ధైర్యం చెప్పి, తన మకాం శ్రీహరి ఆనందసదన్‌కి మార్చేసేడు. తర్వాత ఆ సంస్థలోనే టీచర్ పోస్ట్ ఖాళీ అయితే జీతం అక్కర్లేని పద్ధతిని శారద చేరింది. నెల్లాళ్ల క్రితం శ్రీహరి మరణించాడు. ప్రస్తుతం తండ్రి స్థానంలో శారద శరణాలయం బాధ్యత నిర్వహిస్తుందనీ ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయారనీ, శ్రీహరి ఉండే ఇంటివాళ్లు చెప్పా రుట.

శ్రీహరి పోగానే కెనడాలో ఉన్న శ్రీరాం ఇంటి నంబరుకి ఫోన్ చేశాను. బిజినెస్‌టూర్ మీద జపాన్ వెళ్లాడనీ, పదిహేను రోజుల కు కానీ రాడనీ తెలిసింది. వాణ్ని పట్టుకుని వెంటనే ఇండియా పంపమని వాడు పనిచేసే కంపెనీకి చెప్పడానికి నాకు మనస్కరించ లేదు. జపాన్ నుంచి తిరిగొచ్చాక కబురు తెలిసి బయల్దేరొచ్చాడు.

"ముందు శారదని చూడాలి, బాబాయ్!" అన్నాడు శ్రీరాం.

"ఒరేయ్! శారద మీ నాన్న కూతురు. ఆ శరణాలయంలోనే ఉంటూ ఆ మహానుభావుడి అడుగుజాడల్లో మానవసేవకి అంకితమైన త్యాగమూర్తి. ఇప్పుడు పని తొందరలో ఉంటుంది. సాయంత్రం వెడదాం!" అన్నాను.

"నాన్నకు జబ్బుగా ఉన్నట్టు తెలియబరచ లేదేమిటి బాబాయ్!"

"జబ్బు చేస్తే కదా చెప్పడానికి! రాత్రి నిద్దర్లో పోయాడు, పుణ్యాత్ముడు!" అన్నాను.

"నువ్వే అంత్యక్రియలు చేసేవుట కదా! ఆ మాత్రం అదృష్టానికి కూడా నోచుకోని దౌర్భాగ్యుణ్ణి!" అంటూ లేచి వచ్చి నా పాదాలకి నమస్కరించాడు.

"నేను చేసిందేమీ లేదు. మీ అమ్మకి అంత్యక్రియలు జరుపుతూ -శాంతి కల్లాకపటం ఎరగని అమాయకురాలు, నా కంటేముందే పోవాలనేది. ఆమె కోరిక తీరింది. నా చేతులుమీదుగానే సాగనంపుతున్నాను. నేను పోయినప్పుడు దహనం తప్ప ఏ విధమైన కర్మకాండ వద్దు. ఆ దహనం ఎవరైనా చెయ్యొచ్చు!" అన్నాడు మీ నాన్న. ఆనాడు కాకతాళీయంగా అన్నమాటలే నిజమయ్యాయి!"

"నాన్న పోయేముందు ఎప్పుడుచూసేవు? ఎలా ఉన్నాడు?"

"వారం రోజుల్లో పోతాడనగా చూసేను. చిదానందమూర్తి. ఆ ఆనంద సదనమే వాడి ఆలయం. ఆ పిల్లలే వాడు కొలిచే దేవతలు!"

'నాన్నెప్పుడూ పూజలు, వ్రతాలు, యాత్రలు లాంటి దైవారాధనల్లో పాల్గొనడం నేను చూడలేదు.'

"వాడు కర్మయోగి. వాడి శ్వాసలోనే దైవ విశ్వాసం ఉంది. కోరకలు భవబంధాలు పెంచుకోని జ్ఞాని!" అన్నాను. శారద భర్త పోయిన తర్వాత తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ "జీవితంలో సుఖదుఃఖాలు బొమ్మా బొరుసులాగ ఒకే నాణాని కున్న రెండు ముఖాలు. రెండింటికీ సిద్ధపడాలి. నిత్యం వార్తా పత్రికలో ఎన్ని విషాద సంఘటనలు చూడటంలేదు! ఒక్కొక్కప్పుడు తీవ్రమైన విషాదం జీవిత పరమావధి అన్వేషణకు దోహదం చేస్తుంది. తన జీవితాన్ని చరితార్థం చేసుకోగల చిత్త స్థైర్యం, ఆత్మ విశ్వాసం శారదకి ఉన్నాయి!" అన్న వాడి మాటలు గుర్తుకొచ్చాయి.

* * *

సాయంత్రం శ్రీరాంని వెంటబెట్టుకుని టాక్సీలో ఆనందసదన్‌కి బయల్దేరాను. త్రోవలో కొత్తగా కడుతున్న బిల్డింగ్ చూసి, "బాబాయ్! ఇక్కడ మధుగారి ఇల్లుండాలి!" అడిగాడు. మధు వాడికి తెలుసు. మధు దగ్గర నేను పనిచేస్తున్నట్లూ తెలుసు.

"అదే ఇది. పాతది కూలగొట్టి కొత్తది కట్టాడు.'

"ఇంత పెద్ద ఇల్లా! అమ్మడానికా? తనే ఉండటానికా?"

"తనే ఉంటాడు. ఉత్తరోత్తరా అందులో నీ మేనల్లుడుంటాడు!" అన్నాను. "అన్ని ఇళ్లూ భగవంతుడివే. ఎవరి హయాంలో వాళ్లు తమది అనుకుంటారు!" అన్న శ్రీహరి మాటలు జ్ఞాపకమొచ్చాయి.

"నా మేనల్లుడా?" అన్నాడు శ్రీరాం అర్థం కాక ఆశ్చర్యంగా.

"అవును. మధుకి శారదతన కొడుకుని దత్తత ఇచ్చింది."

"మైగాడ్! ఎందుకు?"

"మధుకి పిల్లలు లేరు. పుట్టరని డాక్టర్లు చెప్పారు."

"కొడుకుని దత్తత ఇవ్వవల్సిన అగత్యమే మొచ్చింది శారదకి! డబ్బుంది, చదువుంది, ఉద్యోగముంది. పిల్లాణ్ణి క్రెష్‌లో ఉంచి, తను శరణాలయంలో ఉద్యోగం చేసుకోవచ్చు, లేదా ఆ ఆనంద సదన్‌లోనే చేర్చి తనతో ఉంచుకోవచ్చుగా!"

"శారద అలాగే చెయ్యాలనుకుంది. "నువ్వు తల్లివి. నీ పిల్లాడిక్కడుంటే వాడి పట్ల పక్షపాతం, ప్రత్యేక శ్రద్ధ చూపెట్టడం సహజం. అది ఈ శరణాలయం క్రమశిక్షణకి విరుద్ధం!" అన్నాడు మీ నాన్న. పిల్లాణ్ని దత్తత ఇచ్చేసి ఆనంద నిలయంలోనే ఉండిపోయి ఆ పిల్లలతోబాటు తన తండ్రికి కూడా సేవ చెయ్యాలని తీర్మానించుకుంది!" అన్నాను.

"దేవుడెక్కడో ఉన్నాడనుకుంటాం. నాన్న గుండెల్లోనే ఉన్నాడు. ఆ దారే శారదకి చూపెట్టాడు!" అన్నాడు శ్రీరాం ఆలోచనగా.